

Dr.G.Rajesh

CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్   సంపుటి : 03   సంచిక : 108   ఎడిటర్ : జి.రాజేష్   బుధవారం 15 జులై 2026   పేజీలు : 6   వెల రూ. 4.00


## ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు



- భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు
- నగర పోలీస్ అధికారులతో సజ్జనార్ సమీక్ష

వివరాలు 2లో

## ముంబయిలో పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

- పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి
- త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష

2లో



# బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలు

- క్రౌడ్ సోర్సింగ్ ద్వారా ఫిర్యాదుల సమాచారం
- ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదు
- అవకాశాలు అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు
- 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి నమోదు
- ఆర్టీజీఎస్ సమీక్షలో దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు

మిగతా 2లో




అమరావతి,**ఐఎన్‌బిటైమ్స్**

ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దేవాదాయ, రహదారులు భవనాలు, ఏపీఎస్ఆర్టీసీ, రవాణా,అగ్నిమాపక, వ్యవసాయ శాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సీఎం సూచనలు జారీ చేశారు. ప్రోయాక్టివ్ గవర్నెన్సు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని



## స్వదేశానికి వియత్నాం బోటు ప్రమాద మృతదేహాలు

- బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం
- సోమవారం రాత్రి నుంచే ఎయిర్‌పోర్ట్‌లోనే మంత్రి కొండపల్లి
- బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పిన మంత్రి

2లో

## ప్రజా జీవితంలో ముద్రగడ పాత్ర చిరస్మరణీయం

- ఆయన మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు
- సంతాపం ప్రకటించిన సిఎం రేవంత్ తదితరులు






# డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

- డేటా ఆధారిత పాలనతో తక్షణ ఫలితాలు
- నెలవారీ ఆర్థిక నివేదికలతో ఆశించిన పురోగతి
- అర్జీల పరిష్కారం, క్షేత్ర స్థాయి పర్యటనలు తప్పనిసరి
- ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- నెలవారీ ఆర్థిక నివేదికలతో ఆశించిన పురోగతి
- అర్జీల పరిష్కారం,స్థాయి పర్యటనలు తప్పనిసరి
- ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి
- కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, **ఐఎన్‌బిటైమ్స్**

డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. డేటా డ్రివెన్ గవర్నెన్సు ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా... నెలవారీ ఆర్థిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై నిర్వహించిన సమావేశంలో సీఎం

మిగతా 2లో



## బోటు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించని సర్కార్

- ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది
- మత్స్యకార కుటుంబాలకు జగన్ పరామర్శ
- సర్కార్ తీరుపై మండిపడ్డ వైసిపి అధినేత

## ఐదేళ్ళ వైసిపి పాలనలో 270మంది మత్స్యకారుల మృతి

- ప్రకృతి వైపరీత్యాలతోనూ అనేక మంది మృత్యువాత
- వాటికి జగన్‌ను తాము ఏనాడూ బాధ్యులను చేయలేదు
- జగన్ విశాఖ పర్యటనపై మండిపడ్డ మంత్రి అచ్చన్న
- అబద్ధాల పునాదులపై పుట్టిందే వైసీపీ
- మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



2లో

# డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్



అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."2019-2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్ధంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం. మరిన్ని రంగాల్లో మరింతగా మెరుగుపడాలి. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. సుపరిపాలన అందించేలా ప్రతీ సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు తెచ్చాం. దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. వనరుల్ని సమర్ధంగా వినియోగించుకోవాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్ , బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన దగ్గర ఉన్నాయి. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకం.

ఇక నుంచి నెల వారీ ఆర్థిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. ప్రతీ నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం ద్వారా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించుకుందాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

**అర్జీలు వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన**

'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి. గత పాలకుల వల్ల రెవెన్యూ శాఖలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి వచ్చింది. పీజీఆర్ఎస్‌లో జీరో పెండెన్సీ అనేది లక్ష్యం కావాలని అన్ని శాఖలకూ నిర్దేశిస్తున్నాను. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి లాంటి ప్రాంతాల్లో భూ సమస్యల్ని పరిష్కరించాం. రీసర్వే ప్రక్రియ ద్వారా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతీ నెలా 9 తేదీన పంపిణీ చేస్తున్నాం. ఇంకా 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ శాఖలు ఆర్జీల పరిష్కారం కోసం నిబంధనల్లో మార్పులు తీసుకురావడం, లేదంటే చట్టాలను సవరించే అంశంపై విశ్లేషణ చేయాలి. మెరుగ్గా పనిచేస్తే 15 శాతం వృద్ధి రేటును సాధించే అవకాశం ఉంది. పాలన సులభతరం చేసేందుకు, రెవెన్యూ వసూళ్లు పెంచుకునేలా కొన్ని ఏఐ టూల్స్ కూడా రూపొందించాం. ఈ ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల్లో 24 శాతం మేర రెవెన్యూ వసూళ్లు పెరిగాయి.

# బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలు



సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సీఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని .. సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సీఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని... యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం**

క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని బస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూముల్ని 22ఏ కింద పెట్టి వివాదంలోకి నెట్టారన్నారు. ఇప్పటికి 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు. శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించటం ద్వారా రైతుల సమస్యలు తీరటంతో పాటు 900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకాశాలనే అన్ లాక్ చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌తో పాటు వివిధ రకాలుగా వచ్చే ప్రతీ అర్జీ, ఫిర్యాదునూ మానవతా కోణంతో పరిష్కరించాలని సీఎం సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలతో పాటు వ్యక్తిగత, సామాజిక అంశాల్లో వచ్చే ఫిర్యాదులపై తగిన నిర్ణయాలు వేగంగా తీసుకోవాలన్నారు. రొటీన్‌గా ఉండే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రీవెన్స్‌ల పరిష్కారం ఆధారంగా ఫిర్యాదులు తగ్గుతున్నాయా లేక పెరుగుతున్నాయో విశ్లేషించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయితే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆర్టీజీఎస్ రూపొందించిన గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్ మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షకు మంత్రి పార్థసారధి వర్చువల్‌గా, ఆర్టీజీఎస్ నుంచి సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఐదేళ్ళ వైసిపి పాలనలో 270మంది మత్స్యకారుల మృతి

అమరావతి,అబద్ధాలు, అసత్య ప్రచారంతో రాజకీయాలు చేసే పార్టీ వైసీపీ అని, అలాంటి పార్టీ అధ్యక్షుడు జగన్‌రెడ్డికి మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ పర్యటనను జగన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నారని విమర్శించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన జగన్‌రెడ్డి మరోసారి నిరాశపరిచారని పేర్కొన్నారు. విశాఖ సముద్రంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా ఆరుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటన బాధాకరమని మంత్రి తెలిపారు. అయితే సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సహాయక చర్యలు ప్రారంభించిందన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేశాయని వివరించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి బైక్ ఢీకొని గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని అన్నారు. విశాఖ తీరంలో ప్రమాదం జరిగిన ప్రదేశం 10 నాటికల్ మైల్స్ దూరంలో ఉండగా, దానిని 10 కిలోమీటర్లలోపే జరిగిందని జగన్‌రెడ్డి చెప్పడం ఆయనకు ప్రాథమిక అవగాహన కూడా లేదనే విషయాన్ని బయటపెడ ుతోందన్నారు. నాటికల్ మైల్స్, కిలోమీటర్ల మధ్య తేడా తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు.

# బోటు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించని సర్కార్



విశాఖపట్నం,జూలై 14 విశాఖలో బోటు ప్రమాదం జరిగిన వెంటనే చంద్రబాబు సర్కార్ ఎందుకు స్పందించలేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విశాఖలోని జబ్బర్‌తోటలో మత్స్యకార కుటుంబాలను ఆయన మంగళవారం పరామర్శించారు. బోటు ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌కు తమ కష్టాన్ని మత్స్యకారులు చెప్పుకున్నారు.. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 1న ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. కేవలం పది మైళ్ల దూరంలోనే ఘటన జరిగింది. జులైన 4న చిన్నా ఫోన్‌చేసి ఇంటికొస్తున్నామని చెప్పాడు. దురదృష్టవశాత్తు ఫోన్ చేసిన కాసేపటికే బోటు ప్రమాదం జరిగింది. ఫిషరీస్ అధికారులు కూడా స్పందించలేదని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోటు ప్రమాదం జరిగిందని అధికారులకు మెసేజ్ చేశారు. రాత్రి 10:30కి కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టారు. వెంటనే స్పందిస్తే గంటల్లోనే మత్స్యకారులు దొరికేవారు. వెంటనే కోస్ట్‌గార్డ్ వచ్చి ఉంటే ఐదుగురైనా బతికేవారు. ఈనెల 5న చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడారు. తప్పుడు జరిగింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారు. త్రీమెన్ కమిటీ నివేదిక అంతా తప్పుల తడక. చంద్రబాబు ప్రభుత్వానికి మానవత్వం ఉందా? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఘటన జరిగిన వెంటనే ఒక్క అధికారి రాలేదు. ఉత్తరాంధ్ర మంత్రులు ఒక్కరు కూడా రాలేదు. బాధితులను ఫిషరీష్ మంత్రి కూడా పరామర్శించలేదు. బాధితుల వద్దకు మంత్రులను పంపాలని సీఎంకు తెలియదా?. రాత్రికి రాత్రే స్పందిస్తే మత్స్యకారులు బతికేవారు. ఎక్స్ గ్రేషియా కింద అరకొర సాయం చేశారు. బాధితులకు రూ.కోటి చొప్పన ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఏడుగురు మత్స్యకారులకు కుటుంబాలకు పరిహారం అందాలన్నారు

## ముంబయిలో పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్



అమరావతి, జులై 14 ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామ ర్శిం చారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిల ోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్టుదలకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు..

## ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

హైదరాబాద్,జూలై14ఆషాడ బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీలో ఆషాడ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్‌తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు.

## ప్రజా జీవితంలో ముద్రగడ పాత్ర చిరస్మరణీయం

హైదరాబాద్,జూలై 14

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, లోక్ సభ మాజీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం గారి ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాసనసభ్యుడిగా, లోక్ సభ సభ్యుడిగానే కాకుండా ప్రజా నాయకుడిగా సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడారని కొనియాడారు . మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ముద్రగడ పద్మనాభం పోషించిన పాత్ర చిరస్మరణీయమని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దేశంలో ఎంతో ప్రభావం చూపించిన విలక్షణ నాయకత్వ లక్షణాలు ఉన్న గొప్ప నాయకులు ముద్రగడ అని అన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ఆయన ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ తనదైన ముద్ర వేసిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. ముద్రగడ పద్మనాభం మరణం రాజకీయ రంగానికి తీరని లోటని పేర్కొన్న మహేష్ కుమార్ గౌడ్.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మరణం పట్ల బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు.

## స్వదేశానికి వియత్నాం బోటు ప్రమాద మృతదేహాలు

అమరావతి, భీమోదయం: వియత్నం పడవ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకుల భౌతికకాయాలు మంగళవారం వారి స్వస్థలాలకు చేరుకున్నాయి. ఉదయం 7.20 గంటలకు ముంబై మీదుగా హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం కార్గో విభాగానికి ఈ మృతదేహాలు చేరుకోగా.. అక్కడ నుంచి ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆంబులెన్స్‌లలో వారి స్వగ్రామాలకు తరలించారు. ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ లావా ఇంటర్నేషనల్ దక్షిణ భారతదేశానికి చెందిన పంపిణీదారులను ప్రోత్సహించే క్రమంలో వీరిని వియత్నాం పర్యటనకు తీసుకువెళ్లింది. శనివారం మధ్యాహ్నం వియత్నాంలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన ఫ్యుకాక్ ద్వీపంలో 32 మంది భారతీయ పర్యాటకులతో వెళుతోన్న బోటు బలమైన గాలులు వీయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కడపకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ మృతిచెందిన సంగతి విదితమే. మృతుల కుటుంబాలకు తక్షణమే సహాయం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. ప్రమాదం జరిగినప్పటి నుంచి ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి వియత్నాం ఎంబసీ అధికారులతో మాట్లాడుతూ ప్రమాదం నుంచి బయటపడిన వారిని ఇండియాకు తీసుకువచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

# 190 కోట్లతో అభివృద్ధి పనులు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు

ఐ ఎన్ బి టైమ్స్ మైలవరం జూలై 14
మైలవరం నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు-భవనాలు, ఇరిగేషన్, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల ద్వారా రూ.190 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో రూ.25 లక్షల డి.ఎం.ఎఫ్ నిధులతో నిర్మించిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మంగళవారం ప్రారంభించారు. తాగునీటి సమస్య నివారణకు రూ.4.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన పైపులైన్ పనులను ప్రారంభించారు. రూ.13లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద పల్లెపండుగ-1, పల్లెపండుగ-2తో పాటు అదనపు పనులు కలిపి 277 పనులకు రూ.42.49 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. వీటితో 57.13 కి.మీ. సీసీ రోడ్లు నిర్మించగా, మరో 2 కి.మీ. బీటీ రోడ్ల నిర్మాణం కొనసాగు తోందన్నారు.ఏపీఆర్ఆర్ఎస్పీ కింద 8 రహదారుల అభివృద్ధికి రూ.11.44 కోట్లు మంజూరై టెండర్ల దశలో ఉన్నాయని, మరో రెండు రహదారులను రూ.3 కోట్లతో పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందులో మర్సుమిల్లి తండా రహదారికి రూ.1.68 కోట్లు, కుంటముక్కల రహదారికి రూ.1.32 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు.ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద కొత్తరెడ్డిగూడెం--కునపరాజుపర్వ మార్గంలో రూ.3 కోట్లతో రెండు వంతెనలు నిర్మిస్తున్నామన్నారు.

అలాగే 29 గ్రామ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.9.35 కోట్లు మంజూరై పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.డీఎంఎఫ్ నిధులతో 29 పనులకు రూ.7.32 కోట్లు వెచ్చిస్తుండగా, మరో 50 పనులకు రూ.13 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు..నూజివీడు--మైలవరం రహదారికి రూ.14.89 కోట్లు, విజయవాడ--విస్సన్నపేట రహదారికి రూ.8.90 కోట్లు, గడ్డమనుగు బైపాస్కు రూ.80 లక్షలు, ఇతర రహదారుల మరమ్మతులకు రూ.2 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం--ఏ.కొండూరు రహదారిలో 5.22 కి.మీ. అభివృద్ధి పనులకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

ఇరిగేషన్ శాఖ ద్వారా 41 వరద మరమ్మతుల పనులకు రూ.32.91 కోట్లు, 27 నిర్వహణ పనులకు రూ.1 కోటి వ్యయంతో పనులు జరుగుతున్నాయని, 2026-27 సంవత్సరానికి కాలువల నిర్వహణ కోసం 40 పనులకు రూ.3.55 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ ద్వారా 191 పనులకు



రూ.67.17 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు తెలిపారు.

జల్ జీవన్ మిషన్, జిల్లా మైనింగ్ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ట్రైబల్ సబ్ప్లాన్ తదితర పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) , కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో విషాద ఘటన

### పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

పల్నాడు,జూలై14 పల్నాడు జిల్లాలోని వినుకొండ మండలం వితంరాజుపల్లిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను హత్య చేసి, తానూ ఆత్మహకు పాల్పడింది. తల్లి నక్క భారతి(28) తన ఇద్దరు కుమారులు హేమంత్ రెడ్డి(5), తేజ(3)ను హత్య చేసిన అనంతరం తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి వచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోగా, కుటుంబ సభ్యుల రోదనలు హృదయాలను కలిచివేశాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర వ్యక్తిగత కారణాల వల్లే ఈ ఘటన జరిగిందా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం పోలీసులు అన్ని ఆధారాలను పరిశీలిస్తూ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## వియత్నాం నుంచి ముగ్గురి డెడ్ బాడీల రాక

**- శంషాబాద్లో ప్రత్యే అంబులెన్స్ల ద్వారా తరలింపు**
**- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

అమరావతి,జూలై14 వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో మృతిచెందిన ఆంధ్రప్రదేశ్కు చెందిన ముగ్గురి మృతదేహాలు మంగళవారం ఉదయం 7:30 గంటలకు హైదరాబాద్లోని శంషాబాద్ విమానాశ్రయం కార్గో టెర్మినల్కు చేరుకున్నాయి. మృతుల్లో కడప జిల్లాకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ ఉన్నారు. మృతదేహాలను భారత్కు తీసుకురావడానికి అవసరమైన అన్ని చట్టపరమైన పక్రియలను ముంబైలో పూర్తి చేసిన తర్వాత కుటుంబసభ్యులకు అధికారులు నేరుగా అప్పగించారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం నుంచి వారి స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ.. కుటుంబసభ్యులకు, సన్నిహితులకు ధైర్యం చెప్పారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపించే పక్రియను స్వయంగా పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి కడప, మచిలీపట్నం, హిందూపురం ప్రాంతాలకు మృతదేహాలను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత అంబులెన్స్ సదుపాయం కల్పించింది. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

## ఇంద్రకీలాద్రిపై పెరిగిన రద్దీ

### అమ్మవారి దర్శనానికి పెరిగిని భక్తుల రాక

విజయవాడ,జూలై14ఆషాడం మొదలు కానుండడంతో బెజవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమావాస్య మంగళవారం కూడా మంచిదన్న భావనతో అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలి రావడంతో భక్తజన సందోహంతో కళకళలాడింది. తెల్లవారు ఝాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికై తరలి వచ్చారు. అమ్మవారి ప్రసాదాలను కూడా భక్తులు పెద్ద ఎత్తుననే స్వీకరించారు. దర్శనం అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాదాల పంపిణీ, భద్రత, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆషాఢ మాసంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతుండటంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం, ప్రసాద సేవ, అన్నదానం, తలనీలాల సమర్పణతో ఆదివారం ఇంద్రకీలాద్రి భక్తి పారవశ్యంతో కళకళలాడింది. భక్తులందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తూ ఆలయం నుంచి ఆనందంగా తిరుగు ప్రయాణం అయ్యారు.

## పంజాబ్లో ప్రైవేట్ స్కూళ్లకు షాక్

చండీఘడ్,జూలై14 పంజాబ్లోని ప్రైవేట్ స్కూళ్లకు అక్కడి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. గత మూడేళ్లుగా రాష్ట్రంలో ఏటా 5 శాతానికి పైగా ఫీజులు పెంచిన ప్రైవేట్ పాఠశాలలు.. ఆ అదనపు మొత్తాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి చెల్లించాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు గత నాలుగేళ్ల ఫీజు రికార్డులను పది రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ఆ సమాచారాన్ని విద్యాశాఖ పోర్టల్లో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఫీజు చెల్లించలేదని మానసిక వేధింపుల కారణంగా ఇటీవల అమృత్సర్లో 17ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనను భగవంత్మాన్ ప్రస్తావించారు. ఈ ఘటన తర్వాత, అధిక ఫీజుల పెంపుపై తల్లిదండ్రుల నుంచి అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ పాఠశాలల (ఖసతిలజీబి। ఁూఇఠనీనీబె)పై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఆర్డినెన్స్ను కోర్టులో సవాలు చేసినా తాము చట్టపరంగా ముందుకు వెళ్తామని.. ఈ విషయంలో వెనుకడుగు వేసేదే లేదని స్పష్టం చేశారు.

## బాబా అవతారంలో హంతక్ రౌడీషీటర్

### వలపన్ని పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్,జూలై14 హత్య కేసు నుంచి తప్పించుకునేందుకు బాబా అవతారం ఎత్తిన రౌడీషీటర్ను పోలీసులు అరెస్ట్ చేశారు. మహ్మద్ జావేద్ అనే వ్యక్తి 2018లో జరిగిన మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. సైఫాబాద్ పోలీస్స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని రౌడీషీటర్ హత్య చేశాడు. ఆపై పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు.. 2020 ఆగస్టులో జావేద్పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. అప్పటి నుంచి జావేద్ కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, పోలీసుల కళ్లుగప్పి సంగారెడ్డి జిల్లా చేర్యాలలో బాబా అవతారం ఎత్తాడు రౌడీ షీటర్. ఓ దర్గాలో బాబాగా రౌడీషీటర్ చలామణి అవుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని చాకచక్యంగా జావేద్ను అదుపులోకి తీసుకున్నారు. ఆపై అతడికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. గాంజా సేవించినట్లు నిర్ధారించారు. మరోవైపు రౌడీషీటర్ వద్ద భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అనంతరం మహ్మద్ జావేద్ను సైఫాబాద్ పోలీసులకు టాస్క్ఫోర్స్ పోలీసులు అప్పగించారు.

## జగన్ ఇకనైనా శవరాజకీయాలు మానుకోవాలి

### టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు



విశాఖపట్నం,జూలై14: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. విశాఖ పర్యటనపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికైనా గొడ్డలి పార్టీ అధ్యక్షుడు శవ రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. నేడు జగన్ రెడ్డి.. విశాఖపట్నానికి ఎందుకు వస్తున్నారో ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఒక్క మత్స్యకారుడికి కూడా న్యాయం చేయలేదని విమర్శించారు. వారికి చట్ట ప్రకారం చెల్లించాల్సిన బకాయిలను చెల్లించలేదన్నారు. అసలు మత్స్యకారులకు జగన్ రెడ్డి ఏం చేశారో సమాధానం చెప్పాలని పల్లా అన్నారు. మత్స్యకార నిధులను కూడా జగన్ డైవర్ట్ చేశారని ఆరోపించారు.

ఇప్పుడు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి ప్రమాద ఘటన గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ మత్స్యకారులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ద

జగన్ రాజకీయాలు చేయడం కోసమే విశాఖకు వస్తున్నారని పల్లా శ్రీనివాస రావు వ్యాఖ్యానించారు.

## కర్నూలులో హైవేపై జాగింగ్ చేస్తుండగా దుర్ఘటన

### గుర్తు తెలియని వాహనం ఢీకొని హెడ్ కానిస్టేబుల్ మృతి

కర్నూలు,జూలై14 జిల్లాలోని బళ్లారి చౌరస్తాలో రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఏపీఎస్పీ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ వర ప్రసాద్ రెడ్డి(43) అక్కడికక్కడే మృతి చెందారు. మంగళవారం ఉదయం హైవేపై జాగింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. వాహనం ఢీకొట్టడంతో హెడ్ కానిస్టేబుల్.. వంతెన పైనుంచి కిందపడిపోయి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ వర ప్రసాద్ రెడ్డి మృతి చెందడంపై హోం మంత్రి అనిత స్పందించారు. హెడ్ కానిస్టేబుల్ మృతి తీవ్ర విచారకరమన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో సేవలందించిన ఒక పోలీసు సిబ్బందిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా నిలిచి, అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ప్రమాదానికి గల కారణాలపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర ప్రసాద్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

## కెపిహెచ్బి లులూ మాల్ వద్ద ఘర్షణ

**- గన్తో వ్యక్తి హల్చల్ చేయడంతో ఆందోళన**
**- మాల్పై కేసు నమోదు చేసిన పోలీసులు**




హైదరాబాద్,జూలై14: కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లులు మాల్లో ఓ వ్యక్తి గన్తో కనిపించడం కలకలం రేపింది. మాల్ పార్కింగ్ వద్ద రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెబుతుండగా పాతబస్తీకి చెందిన సిద్దిఖీ అనే వ్యక్తి జేబులో గన్ను పోలీసులు గుర్తించారు. సిద్దిఖీ దగ్గర గన్ కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలించారు. కాగా గన్కు చెల్లుబాటయ్యే లైసెన్స్ ఉన్నట్లు తేలింది. అయితే గన్తో వచ్చిన వ్యక్తిని మాల్లోకి అనుమతించడంలో భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంపై పోలీసులు సీరియస్ అయ్యారు. మాల్లోకి ప్రవేశించేప్పుడు సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే సదరు వ్యక్తి గన్తో లోపలికి రాగలిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లులు మాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. మాల్ ప్రవేశ ద్వారం వద్ద భద్రతా సిబ్బంది సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే గన్తో సదరు వ్యక్తి లోపలికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సాధారణంగా మాల్స్లో మెటల్ డిటెక్టర్లు, బ్యాగ్ స్కానింగ్ వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంది. కానీ ఈ ఘటనలో భద్రతపరంగా నిర్లక్ష్యం జరిగింది. నేపథ్యంలో భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నందుకు లులు మాల్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులు సూచించారు. ఈ ఘటన నగరంలోని ప్రముఖ షాపింగ్ మాల్స్లో భద్రతా ఏర్పాట్లపై మరోసారి చర్చకు దారితీసింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని మాల్స్లో భద్రతా తనిఖీలను ఖచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

# 'రాకా'లో మరో హీరోయిన్ ఫిక్స్..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్-వరల్డ్ చిత్రం 'రాకా' పై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉండగా, చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. ఇప్పటికే ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే, ఈ సినిమాలో ఒకరికి మించి పలువురు హీరోయిన్లు కనిపించనున్నారనే ప్రచారం గత కొంతకాలంగా సాగుతోంది. మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి పలువురు స్టార్ హీరోయిన్ల పేర్లు కూడా వినిపించాయి.



ఇటీవల మలయాళ నటి ఫెమినా జార్జ్ తాను కూడా 'రాకా'లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించగా, ఇప్పుడు మరో కొత్త పేరు ఈ ప్రాజెక్ట్‌లో చేరింది. పంజాబీ నటి నైలా గ్రేవల్ కూడా ఈ సినిమాలో నటిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన నైలా గ్రేవల్, "దర్శకుడు అట్లీతో పని చేయాలని చాలా కాలంగా కోరుకుంటున్నాను. ఇప్పుడు ఆ అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉంది. బాలీవుడ్‌లో మాత్రమే పనిచేసిన నన్ను ఇలాంటి భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నాను. 'రాకా'లో భాగమవడం నా కెరీర్‌లో ప్రత్యేకమైన మైలురాయి" అని చెప్పింది. నైలా గ్రేవల్ ఇప్పటికే 'తమాషా', 'బరేలీ కి బర్ఫీ', 'తప్పడ్', 'ఇష్క్ విశ్క్ రీబౌండ్' వంటి హిందీ చిత్రాల్లో నటించి గుర్తింపు పొందింది. అలాగే ఓ ప్రముఖ నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్‌లోనూ మెప్పించింది. ఇప్పుడు అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది.

'రాకా'లో పలువురు నటీనటులు భాగమవుతున్న నేపథ్యంలో సినిమా కథ, పాత్రలపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. అట్లీ తన మార్క్ కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సైన్స్ ఫిక్షన్ టచ్ జోడిస్తూ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, మిగిలిన నటీనటులు, కథకు సంబంధించిన వివరాలను మేకర్స్ దశలవారీగా అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సొంతం చేసుకుంటోంది.

# తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్యం దృష్టి

## సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్

సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. మసూద దర్శకుడు సాయి కిరణ్‌తో సినిమా ఖరారైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. ఇప్పటివరకు ఇద్దరి మధ్య స్క్రిప్ట్ చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.




# తుంబాడ్-2 లో ఆలియా భట్

భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్'. ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది' అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపింది.




# తండ్రి విజయ్ కోసం సంజయ్ త్యాగం

## జననాయగన్ కోసం సిగ్మా మూవీ వాయిదా







విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం.సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది. ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.